ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
శనివారం 5 ఏప్రిల్ 2025



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి జేత్వాన్ బుద్ద విహార్ వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్డు పనులను శుక్రవారం బీఎస్‌పి నాయకుడు అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. సకాలంలో పూర్తయేల్యా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, జీవన్, సందీప్, విజయ్, రోషన్, ప్రతాప్, దేవాజీ, పోచయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఆదర్శంగా నిలవాలి

- 67 మందిపై పెట్టిన రౌడీ, అనుమానిత కేసుల రద్దు



మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రౌడీ, సస్పె క్టివ్ షీట్లను తొలగించిన వ్య క్తులు సమాజంలో ఆద ర్శంగా నిలువాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీట్లు, సస్పెక్టివ్ షీట్ల కేసులను రద్దు చేసిన వారికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లా డారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో రౌడీ, సస్పెక్టివ్ షీట్లు నమోదై పది సంవత్సరాలు పై బడిన వారిని, సమాజంలో మంచి పేరు తెచ్చుకొని ఎలాంటి నేరాలు చేయకుండా ఉన్నవారిని, దివ్యాంగులు, వయస్సు పై బడిన వ్యక్తులపై ఉన్న కేసులను రద్దు చేశామని అన్నారు. మొత్తం 67 మం దిపై ఉన్న కేసులను రద్దు చేశామని అన్నా రు. ఇందులో ఎనిమిది మందిపై రౌడీషీట్స్, 59 మందిపై ఉన్న సస్పెక్టివ్ కేసులను రద్దు చేశామన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని చెప్పారు. మరోసారి తప్పు చేస్తే ఏమి కాదని అనుకోవడం పొరపాటన్నారు. కేసులు పరిష్క రించడంతో పాటు తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 106 మందిపై రౌడీషీట్లు, 277 మందిపై సస్పెక్టివ్ షీట్లు ఉన్నాయన్నారు. కేసుల ఎత్తివేత ఏ విధంగా ఉంటుందో అలాగే నూతన కేసుల నమోదు కూడా అలాగే ఉంటుందని చెప్పారు. శాంతి భద్రతల పరిర క్షణలో భాగంగా గడిచిన మూడు నెలల్లో 47 మందిపై సస్పెక్టివ్ షీట్లు, 33 మందిపై రౌడీషీట్లు నమోదు చేశామని అన్నారు. కేసులు రద్దయిన పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమపై ఉన్న కేసులను రద్దు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేసులను రద్దు చేసిన ఏఎస్పీ చిత్తరంజన్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. రెబ్బెన సీఐ బుద్దెస్వామి మాట్లాడుతూ కేసులను ఎత్తివే యడం అనేది ఒక గొప్ప చరిత్రకు పునాదిలాం టిదని తెలిపారు. సమావేశంలో ఆసిఫాబాద్, వాంకిడి సీఐలు బుద్దె రవిందర్, సత్యనారాయ ణ, ఎస్సైలు గంగన్న, ప్రశాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఉన్నా.. వసతులు కరువు

- తైబజార్ల వేలం ద్వారా రూ. లక్షల ఆదాయం
- కనీస వసతులు లేక వ్యాపారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కాగజ్‌నగర్‌లో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో ఏళ్లుగా అంగళ్లు నిర్వహిస్తున్నారు. అక్కడ విక్ర యించే వ్యాపారులు అందుకు తగిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. తైబజార్ల రుసుం వసూళ్లు చేసే హక్కును వేలం పాట ద్వారా నిర్ణయిస్తారు. ఎక్కువ మొ త్తం పాడిన వ్యక్తికే రుసుం వసూలు చేసుకునే హక్కును కల్పిస్తారు. ఈ ఏడాది మున్సి పాలి టీలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో తైబజార్ల వేలం పాటను నిర్వ హించారు. పలువురు పోటీ పడి తైబజార్లలో రుసుం వసూలు చేసే హక్కును లక్షల రూపా యలకు పాడి దక్కించుకున్నారు. కానీ లక్షల రూపాయలుఆదాయం సమకూరుతున్న ఆయా ప్రాంతాల్లోని విక్రయ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడం లేదు. దీంతో వ్యాపా రులతో పాటు కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తైబజారు వేలం ప్రక్రియ గత నెలలో జిల్లా లో నిర్వహించారు. సిర్పూరు(టి) మేజర్ గ్రామ పంచాయతీ, చింతలమానేపల్లి గ్రామపంచాయ తీలు ఇంకా పూర్తి కాలేదు. మిగితా అన్ని గ్రామ పంచాయతీల్లో టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. సగటును అన్ని గ్రామపంచాయతీలకు పోటీ పెరిగి ఈ సారి పెద్ద ఎత్తున ఆదాయం సమ కూరింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ఈ ఏడాది రూ.10 లక్షలు ఆదాయం రావడం విశే షం. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ తైబజార్‌కు గత నెల 22న వేలం ప్రక్రియను అధికారులు నిర్వ హించారు. ఈ తైబజారు టెండరుకు రూ.6.80 లక్షలు, ఎద్దుల వధ శాలకు రూ.3.80లక్షలు, మేకల వధ శాల ప్రభుత్వం విధించిన టెండరు ధరకు కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతో వాయిదా పడింది. ఈ సారిగా జరిగిన తైబ జారు వేలంలో రూ.10 లక్షలు ఆదాయం సమ కూరింది. కొవిడ్ తర్వాత వేలం ప్రక్రియ నిర్వ హించలేదు. ఆసిఫాబాద్ పరిధిలో రాజంపే టలో కూడా రూ.8.00 లక్షలకుపాడి కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. కౌటా ల గ్రామపంచాయతీకి నిర్వహించిన తైబజారు వేలంలో గతేడాది రూ.4 లక్షలు ధర పలు కింది. ఈ సారి మాత్రం పోటా పోటీ పెరిగి ఒక్కసారిగా రూ.7.21లక్షలు కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఏకంగా ఇక్కడి గ్రామ పంచాయతీకి రూ.3లక్షల మేర ఆదాయం వచ్చింది. అలాగే బె జ్జూరు కూడాలో గతేడాది రూ.2.50 లక్షల టెండరు ధర పలు కగా ఈ సారి మాత్రం రూ.3.50 లక్షలు టెండరను కాంట్రాక్టర్ దక్కిం చుకోవడంతో లక్ష ఆదాయం రావడం విశేషం. వాంకిడి గ్రామపంచాయ తీలో కూడా ఈ సారి రూ.8.50 లక్షలు ధర వచ్చింది. గతేడాది రూ.5లక్షలకు ధర ఉంది., ఈ సారి మాత్రం రూ.2.50లక్షల ఆదాయం వ చ్చింది. సిర్పూరు(టి) మేజర్ గ్రామ పంచాయతీకి తైబజారు వేలం నిర్వ హించగా, ప్రభుత్వం ధరకు కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతో ప్రస్తు తానికి వాయిదా వేశారు.

సమకూరిన ఆదాయాన్ని..

తైబజారు వేలం ద్వారా వచ్చిన ఆదా యాన్ని పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లింపు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ మార్కెట్ అభివృ ద్ధి కోసం వెచ్చించాల్సి ఉంటుంది. కానీ అధికా రులు ఇతరాత్ర ఖర్చులకు వినియోగిస్తుండడం తో మార్కెట్లలో కనీస సౌకర్యాలు లేకుండా పో యాయి. ప్రతి మండల కేంద్రంలో ని ర్వహించే వారసంతల్లోనూ సమస్యలు పేరుకుపోతున్నా యి. మార్కెట్‌కోసం ప్రత్యేక స్థలం లేకపోవడం తో పలు చోట్ల రోడ్లపైనే వ్యాపారులు విక్రయా లు కొసాగిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపక్కన నిలిపిఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని చోట్ల స్థలం ఉన్నా అక్కడ ఎండ, వాన నుంచి రక్షణకు షెడ్లు నిర్మించలేదు. దీంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారు లు మార్కెట్లు, వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

- తెల్లరేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందజేస్తాం
- అధికారులు చర్యలు తీసుకుంటారు
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆసిఫాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స న్న బియ్యం అందవని లబ్ధిదారులు ఆందోళన చెంద కూడదని, కార్డుదారులందరికీ అందజేస్తామని కలెక ్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం పాడిబండ గ్రామంలో తెల్ల రేషన్‌కార్డుదారులకు శుక్రవారం సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రతి లబ్ధిదారుడికి బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో శుక్రవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో అంజద్‌పాషా, డీటీ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం మదువా యిగూడలో శుక్రవారం సన్న బియ్యం పంపిణీ కా ర్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, వీఓపీఆర్డీ వాసు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శులు మురళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని మ హగాంలో శుక్రవారం సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమంను నిర్వహించారు. జైనూర్ మార్కెట్ క మిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌కుమార్, నాయకు లు ఆత్రం ప్రకాష్, కుమ్ర శంకర్, కోట్నాక నాగు, మె స్రం జగదీష్, రాయిసంటార్ సార్మెడి ఆత్రం ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తిడి గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు డిప్యూటీ తహసీల్దార్ బీమ్లానాయక్ శుక్రవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్, శంకర్, లక్ష్మీనారాయణ, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. శుక్రవా రం మండలంలోని చౌకధరల దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, కార్యదర్శులు ప్రణీత్ బాబు, డీలర్లు శ్రీనివాస్, పోశన్న పాల్గొన్నారు.



సిర్పూర్(యు) మండలంలో బియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావు

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి



భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎల్ఆర్ఎస్ రుసుం వసూలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం ఎల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ లేని భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్-2020 ద్వారా అవకాశం కల్పించిందని చెప్పారు. ఈ కరమంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి అర్హులైన వారి నుంచి రుసుం వసూలు చేస్తామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లింపుకు ప్రభుత్వం గడువు పొడిగించిందని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన

కౌటాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని కన్యకాపరమే శ్వరి ఆలయంలో దేవి భాగవతంలో భాగంగా శుక్రవారం ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు దేవి భాగవతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ప్రవచకులు మేఘానాథ్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. భక్తులకు అన్నాదానం చేపడుతున్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు

కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్‌పై చెడు ప్రభావం చూపే మాదక ద్రవ్యాల రవాణాపై జిల్లాలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి నషా ముక్ భారత్ అభియాన్‌లో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలపై దష్ప్రభావాలను చూపే మాదక ద్రవ్యాల రవాణాపై జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. డ్రగ్, గంజా యి సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించి ఎంతో మంది ప్రాణాలు కోల్పో తారని చెప్పారు. మాదకద్రవ్యాల మత్తులో తీవ్ర నేరాలకు పాల్పడుతు న్నారని అన్నారు. గంజాయి పండించడం, రవాణా చేయడం, విక్రయిం చడం, సేవించడం వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, డీఎంహెచ్‌వో సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సన్మానం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపో రిటైర్డ్ ఎం ప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్య తలు స్వీక రించిన రాజశేఖర్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మల్లేష్, నారాయణ, అస్గర్, భీం రావు, దివాకర్, అశోక్, మహబూబ్ తదిత రులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి..

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావర్తి రవీందర్, కార్యవర్గ సభ్యులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారీక్, వినా యక్‌రావు, అబ్దుల్లా, రమణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత

సిర్పూర్(టి), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని డీఎ స్పీ రామానుజం అన్నారు. శుక్రవారం పోలీ సు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టే బుల్ శంకర్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో ఆయనను అభినందించారు.

పూలాజీబాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవం

వాంకిడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వాం కిడి మండల కేంద్రంలోని పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్ర వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజా రోహణ నిర్వహించి పూలాజీ బాబా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థాన్ పట్నా ఫూర్ ప్రధాన కార్యదర్శి దాదారావ్, ప్రకా ష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



కలెక్టరేట్ వద్ద కూలీలను అడ్డుకుంటున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫా బాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆసిఫాబాద్, గొడవెల్లి, జన్కాపూర్, హీరాపూర్, తారకరామనగర్‌కు చెందిన 406 జాబ్ కార్డు కలిగిన 701 మంది తమకు ఉపాధి హామీ పని కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్షురాలు గరిగెలి పద్మ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో తాము ఉండడంతో ఉపాధి హామీ పనులు కోల్పో యామని చెప్పారు. తమకు జాబ్‌కార్డులు ఉన్నా అధి కారులు పని కల్పచడం లేదన్నారు. వేసవిలో తాము ఇబ్బందులుపడుతున్నామని తెలిపారు. స్థానిక సీఐ రవీందర్, ఎస్సై ప్రశాంత్‌లు కూలీలకు నచ్చ చెప్పడం తో రాస్తారోకో విరమించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని చెప్పడంతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చ చెప్పారు. అనంతరం వారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కూలీల సంఘం నాయకులు పావణి, స్వరూప, మంజు, సుగుణ తదిత రులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం



జైనూర్‌లో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైనూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వా మ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జై బాపూ, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని జంగాం, శిసూర్, పార పోచంలొద్ది, సుకుడ్ పెల్లి, ఉషేగాం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు వినోద్, పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మాజీ మండల ఉపాధ్యక్షుడు చిర్లే లక్ష్మణ్ తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న తరుణంలో రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం తమ పార్టీ చేపడుతుందని చెప్పారు. రాజ్యాంగం సాక్షిగా పార్లమెంటులో అమిత్‌షా అంబేద్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడారని చెప్పారు. ఆ వ్యాఖ్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. భారత రాజ్యాంగం దేశ నలుమూలలకు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్య పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెందూర్ ప్రకాష్, సు ద్దాల ఆనంద్, సుద్దాల శ్రీనివాస్, కనక గంగా రాం, సుదర్శన్, దండుగుల మహేష్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిషాని, ఇందాపూర్ గోండుగూడ, అగర్‌వాడ, ఖైరి గ్రామాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్రలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుసుంరావ్, వసంత్, నానేష్, లింబారావు, నగేష్, హన్మంతు, ఖుత్బో ద్దీన్, శంకర్, విశ్వనాథ్, పాలక్‌రావు, ముకుం దరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన, గోలేటి, రోళ్ల పాడు తదితర గ్రామాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రామన్ని నిర్వహించారు. కా ర్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, నా యకులు మధునయ్య, రవీందర్, సుదర్శన్, కిషన్, సురేందర్, వెంకటేశంచారి, గాజుల రవి, సత్యనారాయణ, కమల్, సాయి సంఘమిత్ర వి జయ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

నిందితుల అరెస్టు


తవ్విన గుంత

వేమనపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం రాజారాం గ్రామంలో గురువారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం రాజారం గ్రామానికి చెందిన జమ్మి మల్లయ్య, బెజ్జూరు మండలం ముంజంపల్లికి చెందిన బారెపల్లి సుధాకర్ , కాసిపేట మండలం పెద్దనపల్లికి చెందిన ముత్యం మధు, కరీంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నల్ల కుమార్‌లు కలిసి మండలంలోని రాజారం గ్రామంలో గురువారం రాత్రి జమ్మి మల్లయ్య పెరట్లో గుప్తనిధుల కోసం గుంత తవ్వగా ఎలాంటి నిధి లభ్యం కాలేదు. గమనించిన ఇంటి పక్క వారు తవ్వకాలు ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించడంతో తమ భూమిలో నిధులు ఉన్నాయని తాము తవ్వకుంటాం మీకెందుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిధుల కోసం తవ్విన గుంతను పరిశీలించారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

చెన్నూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన చల్ల సుధాకర్‌రెడ్డి, నెల రోజుల క్రితం ఖాజా, ఇమ్రాన్‌ల బైక్‌లు దొంగతనానికి గురి కావడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఎస్‌ఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి కొత్త బస్టాండ్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన ముష్కె జగదీష్ అనే యువకుడు మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతడిని పట్టుకుని విచారించారు. విచారణలో ఈ మోటార్ సైకిల్‌ను చోరీ చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. పట్టణంలోని కిరణ్ ఆసుపత్రి ముందు ఒక మోటార్ సైకిల్‌ను, 2024 డిసెంబర్‌లో భూపాలపల్లి పట్టణంలో ఒక మోటార్ సైకిల్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. మూడు మోటారు సైకిళ్లను స్వాధనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐతో పాటు పోలీసులను సీఐ అభినందించారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చింతలమానెపెల్లి మండలంలో 300 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. కాగజ్‌నగర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో రంగంలోకి దిగి వ్యూహాత్మంగా దాడి చేసి పట్టుకున్నట్లు వివరించారు. ఇందులో నకిలి బీటీ-3 పత్తి విత్తనాలు రైతులకు సరఫరా చేసేందుకు ఆసిఫాబాద్ బూరుగూడకు చెందిన లోకండె భిక్షపతి, గుంటూరుకు చెందిన సురేష్ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ నకిలీ పత్తి విత్తనాలను రైతులకు ఇచ్చేందుకు చింతలమానెపల్లి తీసుకువచ్చినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10.50లక్షలు ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో సీఐ రాజేంద్ర ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, కానిస్టేబుళ్ల మధు, రమేష్, సంజీవ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలు.. @ 94 శాతం



వంద శాతం దిశగా సిబ్బంది ప్రయత్నాలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది 94శాతం ఆస్తి పన్ను వసూలయ్యాయి. ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహిస్తూ సిబ్బంది దిశా నిర్దేశం చేయడం వల్లే ఇది సాధ్యమైందని చెబుతున్నారు. గ్రామ పంచాయతీలకు ముఖ్యమైన ఆదాయమైన ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లా అధికారులు ముందు నుంచి పకడ్బందీ ప్రణాళికతో వెళ్లి అనుకున్న లక్ష్యాన్ని సాధించినట్లు కనిపిస్తోంది. రోజు వారీ వసూళ్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం వంటి పనుల సత్ఫలితం ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సక్రమంగా రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. దీంతో సిబ్బంది ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారని చెబుతున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాలు మొత్తం 335 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో 1,36,360 ఇళ్లను గుర్తించారు. వీటి నుంచి పన్నుల రూపంలో రూ. 5.49 కోట్ల పైచిలుకు వసూలు చేయాల్సి ఉంది. మార్చి నెలాఖరుకు రూ. 5.16 కోట్లు వసూలు చేశారు. దీంతో 94 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో పెంచికల్‌పేట, ఆసిఫాబాద్, సిర్పూర్(టి), కౌటాల, దహెగాం మండలాల్లో 100 శాతం పన్ను వసూలయ్యాయి. చింతలమానేపల్లి మండలంలో 99 శాతం, సిర్పూర్(యు), రెబ్బెన, కాగజ్‌నగర్, కెరమెరి, లింగాపూర్, వాంకిడి మండలాల్లో 90 శాతంకు పైగా వసూలయ్యాయి. కాగా తిర్యాణి, బెజ్జూర్ మండలాల్లో 80 శాతానికి పైగా సాధించిన అధికారులు జైనూరులో మాత్రం 70 శాతం వచ్చిందని చెబుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది వంద శాతం పన్నుల వసూలు లక్ష్యంగా పని చేశారు. త్వరలోనే ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

సిబ్బంది కృషి అభినందనీయం..

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



పన్ను వసూళ్లలో సిబ్బంది కృషి అభినందనీయం. జిల్లాలో ఐదు మండలాల్లో వంద శాతం వసూలు కావడం హర్షణీయం. మిగతా మండలాల్లో 90 శాతానికి పైగా వసూలు చేయడం వెనుక సిబ్బంది కృషి ఎంతగానో ఉంది. కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో వంద శాతం సాధించే దిశగా ప్రయత్నాలు చేశాం.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

జితేందర్, వెటర్నరీ అసిస్టెంట్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేసవిలో పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వెటర్నరీ అసిస్టెంట్: వేసవి కాలంలో కావడంతో వేడి నుంచి పశువులకు రక్షణ కల్పించాలి. నీడలో ఉంచుతూ అధికంగా నీరు తాగించాలని సూచిస్తున్నాం. వ్యాధుల బారిన పడినట్లయితే పశువైద్యశాలకు తీసుకు వస్తే చికిత్స అందిస్తాం.

ఆంధ్రజ్యోతి: పశువులకు వడదెబ్బ తగలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

వెటర్నరీ అసిస్టెంట్: రైతులు ఉదయం పది గంటలు దాటిన తరువాత పశువులను బయటకు తీసుకెళ్లకూడదు. ఒక వేళ పశువులకు వడదెబ్బ తగిలితే చల్లటి గాలి తగిలే ప్రదేశంలో తీసుకువెళ్లాలి. తక్షణమే నీళ్ల తాగించి నీడలో ఉంచాలి. అనంతరం పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం అందించాలి.

ఆంధ్రజ్యోతి: సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

వెటర్నరీ అసిస్టెంట్: పశువైద్య కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అం దుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలి. - బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

నాటు సారా విక్రయాలను అడ్డుకోవాలి

దహెగాం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అమర్‌గొండ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం నాటుసారా విక్రయాలను అడ్డుకోవాలని ఎస్సై రాజుకు వినతి పత్రం అందజేశారు. నాటు సారా తాగి అనారోగ్యం పాలువుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పై అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో బెల్లంపల్లి ఎమ్మెల్యే పైన అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపారు. శుక్రవారం ముచ్చర్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు సోషల్ మీడియాలో బెల్లంపల్లి నియోజకవర్గం అనే గ్రూపులో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందున్న ఖాళీ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఎమ్మెల్యే పైన అసత్య ప్రచారం చేశారు. దీంతో ముచ్చర్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు బెల్లంపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నూనేటి సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జన్నారం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమడుగు గ్రామ శివారులోని కోళ్లఫారంలో పేకాట స్థావరంపై జన్నారం పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. కోళ్లఫారంలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 62 వేల నగదు, 9 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ సన్న బియ్యం అందజేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల్లో పేరు ఉన్న అర్హులందరికీ సన్న బియ్యం అందించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫ రాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి తెల్లరేషన్ కార్డుదారుడికి నాణ్యమైన సన్న బియ్యం అందించాలని చెప్పారు. నిరుపేదల కడుపు నింపాలనే భావనతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రజాప్రతినిధులతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఒక వేడుకలా ప్రారంభించాలని సూచించారు. ప్రజాపాలన గ్రామ సభలలో కొత్త రేషన్ కార్డుల కోసం, కార్డులలో మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం వచ్చిన దఖాస్తులను పరిశీలించాలన్నారు. త్వరగా కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంపై రేషన్ కార్డుదారుల స్పందన తెలుసుకోవాలని చెప్పారు. క్రలెక్టరేట్ సముదాయంలో గల వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎండేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు జిల్లాలో మొత్తం 314 రేషన్ దుకాణాలు ఉన్నాయని అన్నారు. 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ లక్ష్యమని అన్నారు. ఇప్పటి వరకు 90 శాతం చౌక ధరల దుకాణాలకు బియ్యం పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంత్యోత్సవ మండల కమిటీ

సిర్పూర్(టి), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల బుద్ధ జయంత్యోత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుర్గం విక్రం, ఉపాధ్యక్షులుగా జనార్ధన్, వివరాం, నవీన్, తిరుపతి, రాజారాం, సూరజ్, ప్రేమానంద్, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా హీరామన్, ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అంతకు ముందు రమాబాయి అంబేద్కర్, భీంరావు అంబేద్కర్ వివాహ దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, విశ్వనాథ్, రాజు, నాందేవ్, తిరుపతి, దేవిదాస్, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని పాడిబండ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, వాటర్ షెడ్ ప్రత్యేకా. దికారి ప్రకాష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావులతో కలిసి కలెక్టర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ప్రకృతిని కాపాడుతూ భవిష్యత్ తరాలకు సహజ వాయువుతో పాటు నీటిని అందించాలని అన్నారు. అంతకు ముందు గ్రామంలో వాటర్ షెడ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్, అంజనే యులు, నాయకులు మల్లికార్జున్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

ఆలయంలో ప్రత్యేక పూజలు

రెబ్బెన, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరనగర్‌లో శ్రీ కనకదుర్గా మహంకాళి ఆలయాన్ని శుక్రవారం ఆసిఫాబాద్ న్యాయమూర్తి యువరాజ్ ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం న్యాయమూర్తిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, ఆలయ ప్రధాన అర్చకుటు దేవర వినోద్, కమిటీ సభ్యులు కావుడే సంతోష్, కమ్మరి మల్లేష్, రమేశ్ పాల్గొన్నారు.

మైనార్టీ శాఖ జిల్లా అధికారిగా నదీమ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ శాఖ అధికారిగా అబ్దుల్ నదీమ్ ఖుద్దూసీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో హార్టికల్చర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన డీటీడీవో రమాదేవి నుంచి అదనపు బాధ్యతలను తీసుకోనున్నారు.

ఇద్దరి బైండోవర్

సిర్పూర్(టి), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల విక్రయ కేసులో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. పారిగాం గ్రామానికి చెందిన హుల్కె మోతిరాం, బొల్లబోయిన అశోక్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.



టింబర్‌యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టింబర్‌యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి రియాజ్ అహ్మద్ అన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. గత 35 ఏళ్లుగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల వైఖరి వల్ల టింబర్‌యార్డు కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. యార్డు కార్మికులు 30 ఏళ్లుగా వేతన నష్టానికి గురవుతున్నారని, ఈ విషయంలో తాము రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్వీసు, సీఎంపీఎఫ్, పెన్షన్, వేతనాల విషయంలో పూర్తి న్యాయం చేసామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకుడు సారయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, సహాయ కార్యదర్శి నోముల బాలయ్య, ఆర్‌జీ-1 బ్రాంచ్ కార్యదర్శి పల్లె క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధ్యం


కార్మికులకు స్వీటు బాక్సులు అందజేస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధ్యమవుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయబాస్కర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖైరిగూడ ఉపరితల గనిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. మార్చి నెలలో 100 శాతం ఉత్పత్తి సాధించిన స్పెషల్ ఇన్‌సెంటివ్ స్కీంకి అర్హత సాధించిన కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా స్వీట్ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్, సేఫ్టీ అధికారి నారాయణ, డివై పీఎం వేణు, సంక్షేమాధికారి రజినికుమార్, ఏఐటీయూసీ నాయకులు శేషు, ఓదెలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఖాళీలను భర్తీ చేయాలి


బొగ్గు గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని బీఎంఎస్ ప్రతినిధుల బృందం సభ్యులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవా రం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, కోల్ ఇండియా ఛైర్మన్ పి.ఎం. ప్రసాద్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. బీఎంఎస్ 19వ త్రై వార్షిక మహాసభలలో తీర్మానించిన అంశాల ను వారి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలో ఖాళీలను ఎప్పటి కప్పుడు భర్తీ చేయాలని, నాన్ మైనింగ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికు లకు ఎక్కువ వేతనాలు ఇవ్వాలని కోరారు. సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ ప్రక్రియను త్వరలో పూర్తిచేయాలని, విశ్రాంత కార్మికులకు కనీస పెన్షన్ మొత్తాన్ని 1000 నుంచి 5 వేల రూపాయలకు పెంచాల ని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, కాంట్రాక్ట్, రిటైర్డ్ కార్మికులకు సింగరేణిలో ఉన్న ఖాళీ క్వార్టర్లు కేటాయించేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీకేఎంఎస్ ప్రతినిధి బృందం లక్ష్మారెడ్డి, సంజయ్ చౌదరి, రంజన్ బెహెరా, సుజిత్‌సింగ్, ఆశిష్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గని మేనేజర్‌కు సన్మానం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా కేకే 5 గని నూతన మేనేజర్‌గా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టిన శంభునాథ్‌పాండేను గని అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించారు. అలాగే కార్మిక సంఘాల నాయకులు గని మేనేజర్‌ను శాలువాలతో సన్మానించి పూల మొక్కలు అందించారు. గని మేనేజర్ మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు కార్మిక సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవికుమార్, సంక్షేమాధికారి మాస్కుల కార్తీక్, పిట్ ఇంజనీర్ నవీన్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్,కేకే 5 గని ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషితోనే సంస్థ ప్రగతి


కార్పొరేట్ జీఎం హెచ్ఆర్‌డీని సన్మానిస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల కృషితోనే సంస్థ ప్రగతి సాధ్యమని కార్పొరేట్ జీఎంహెచ్ఆర్‌డీ రఘుపతి అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ జీఎం హెచ్ఆర్‌డీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రఘుపతి శుక్రవారం మందమర్రి ఏరి యాను సందర్శిం చారు. ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుం దన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యమనే విషయాన్ని అందరు గ్రహించాలన్నారు. ప్రమాదాల నివారణకు సింగరేణి యాజమాన్యం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్తుందన్నారు. ఉద్యోగులు, అధికారులు కలిసి కట్టుగా పనిచేయడం ద్వారానే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్, అధికారులు రఘుపతిని సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణాదికారి రవీందర్, డీజీఎం ఈఅండ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

జైపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 20న జరిగే ఒక్క రోజు టోకెన్ సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఐకే 1ఏ గనిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని చెప్పారు. 44 కార్మిక చ ట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం ఇల్లెందు, కోయగూడెం ఓసీపీని, సత్తుపల్లి ఓసీపీలను ప్రైవేటు వారికి ఇచ్చిందని, వీటిని రద్దు చేసి సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మణుగూరు ఓసీపీ 2ను ఎక్స్‌టెన్షన్ చేయాలని, గోలేటి 1, మాదారం 1 గనులను ప్రారంభించాలని, కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, బాల కృష్ణ, శ్రీనివాస్, అఫ్రోజ్‌ఖాన్, పెద్దన్న, సత్త య్య, వెంకటేష్, రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

పి. సతీష్‌కుమార్, తహసీల్దార్



అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తామని మందమర్రి తహసీల్దార్ పనకంటి సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : మందమర్రిలో డబుల్ బెడ్ రూంలు ఎంత మందికి అందించారు?

తహసీల్దార్ : మొత్తం 560 డబుల్ బెడ్ రూం ఇండ్లు ఉండగా ఇప్పటి వరకు 243 మందికి అందజేశాం.

ఆంధ్రజ్యోతి : డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో అన్ని సౌకర్యాలు కల్పించారా ?

తహసీల్దార్ : డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో పూర్తిస్థాయిలో కరెంటు, మంచినీరు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాము. విద్యుత్ కనెక్షన్ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : విద్యుత్ కోసం మీ సేవలో ఎంత చెల్లించాలి?

ఆంధ్రజ్యోతి : డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ కోసం రూ. 1500 రుసుము చెల్లించి కనెక్షన్ పొందాలి. అంతకంటే ఎక్కువ చెల్లించవద్దు.

ఆంధ్రజ్యోతి : నీటి సౌకర్యం కోసం ఎన్ని బోర్లు ఏర్పాటు చేశారు?

తహసీల్దార్ : డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో నాలుగు బోర్లు ఉన్నాయి. బ్లాక్ వైజ్‌గా ఉన్న బోర్లను వాడుకుని బ్లాక్‌లో ఉన్న వారే కరెంటు బిల్లులు చెల్లించుకోవాలి. పట్టా పొందినప్పటి నుంచి ఇండ్ల బాధ్యత పూర్తిగా లబ్ధిదారులపైనే ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : మిగితా ఇండ్లను ఎప్పుడు అందజేస్తారు?

తహసీల్దార్ : మిగిలిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను త్వరలోనే అందజేస్తాం.

- మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి)

నూతన డీటీఆర్ ఏర్పాటు

చెన్నూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ఎస్సీ కాలనీలో శుక్రవారం నూతనంగా 63కేవీఏ డీటీఆర్‌ను ఏర్పాటు చేసినట్లు చెన్నూరు విద్యుత్ ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఏఈ శ్రీనివాస్, ఎల్‌ఎం రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

మామిడి కొనుగోళ్లకు సన్నద్ధం



- ఏళ్లుగా నిరుపయోగంగా యార్డు
- ఈ సీజన్‌లో కొనుగోళ్లకు అధికారుల ఏర్పాట్లు
- జిల్లాల్లో వేల ఎకరాల్లో మామిడితోటలు
- తీరనున్న రైతుల కష్టాలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న మామిడి మార్కెట్ యార్డుకు ఈ సీజన్‌లో మోక్షం కలుగనుంది. జిల్లాలో వేల ఎకరాల్లో మామిడితోటలు ఉన్నాయి. ప్రతీ ఏటా రైతులు జిల్లాలోని మామిడి మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చే పట్టకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. దీంతో రైతులు రవాణా ఖర్చులతో పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు చేసేందుకు సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధమవుతుండడంతో రైతుల కష్టాలు తీరనున్నాయి.

ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా..

బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన మామిడి మార్కెట్ యార్డు మామిడి క్రయవిక్రయాలు చేపట్టకపోవడంతో నిరుపయోగా ఉంటుంది. 2015లో మామిడి మార్కెట్ మంజూరైంది. రూ.1.26కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో పదివేల టన్నుల సామర్థ్యం గల రెండు షెడ్లను నిర్మించారు. 2016లో మార్కెట్ యార్డుకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. 2023లో రూ.1.18కోట్లతో ఆర్‌వో ప్లాంట్ సీసీసీ రోడ్లు, అదనపు షెడ్లను నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నప్పటికీ వినియోగంలోకి మాత్రం రాలేదు. ఈ మార్కెట్ యార్డులో మామిడి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు పండించిన పంటను మహారాష్ట్రలోని నాగ్‌పూర్, చంద్రాపూర్ ఇతర ప్రాం తాలకు వెళ్లి విక్రయించారు. అక్కడ దళారుల చేతుల్లో నష్టపోవడమే కాకుండా రవాణ ఖర్చుల భారం రైతుల పై పడేది. స్థానికంగా కొనుగోళ్లు లేక కొందరు రైతులు మామిడి తోటలను తీసివేసి వేరే ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

ఇక్కడే కొంటే రైతులకు ఉపయోగం...
ఇబ్రహీం, తాండూరు రైతు

బెల్లంపల్లి మామిడి మార్కెట్ యార్డులో మామిడి కొనుగోలు చేస్తే ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుంది. ప్రతి ఏటా మహారాష్ట్ర నాగపూర్ వంటి దూర ప్రాంతాలకు మామిడి పంటను తీసుకవెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. రవాణ ఖర్చులతో పాటు దళారుల చేతుల్లో నష్టపోవాల్సి వస్తోంది.

ట్రేడ్ లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం..
భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి



నిరుపయోగంగా ఉన్న మామిడి మార్కెట్ షెడ్లు

మామిడి మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమవుతున్నాం. మ్యాంగో మార్కెట్‌లో వ్యాపారస్తులను లైసెన్స్ పొందేందుకు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలి. ట్రేడర్స్ లైసెన్స్ దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావాలి. స్థానికంగా మామిడి కొనుగోలు చేపడితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

తీరనున్న రైతుల కష్టాలు..

జిల్లాలో వేల ఎకరాల్లో మామిడి పంటను వందలాది మంది రైతులు సాగు చేస్తున్నారు. మామిడి మార్కెట్‌లో స్థానికంగా కొనుగోళ్లు చేయకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి దళారుల చేతుల్లో మోస పోయేది. ప్రస్తుతం బెల్లంపల్లి మామిడి మార్కెట్ లో కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నద్ధం అవు తున్నారు. ఇప్ప టికే మామిడి దిగుబడిని కొనుగోలు చేయడానికి ట్రేడర్ల ను, కమిషన్ ఏజెంట్లను మార్కెట్ శాఖ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని తెలుపుతున్నారు. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ట్రేడర్లతో మార్కెట్‌శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ట్రేడర్లు ఆసక్తిగా ఉన్నారు. లైసెన్స్ దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు వస్తుండడంతో కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మరో రెండు నెలల్లో మామిడి దిగుబడి రైతుల చేతికి అందనుంది. ఈ క్రమంలో స్థానికంగా కొనుగోళ్లు చేపడితే జిల్లాలోని వందలాది మంది రైతులకు ఎంతో మేలు జరుగనుంది.



బెల్లంపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పాతుకుపోయారు...!

(5వ పేజీ తరువాయి)

స్థానికంగా ఓ గనిలో పదేళ్లకు పైగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అవినీతికి అంతం లేకుండా పోయిందనే ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇచ్చిన కిందిస్థాయి ఉద్యోగులకు తేలికైన పనులు అప్పగిస్తుంటాడని సమాచారం. అలాగే ఇదే డివిజన్‌లోని ఓ మేనేజర్ కూడా ఏదో ఒక నజరానా ఇస్తే పనులు చక్కబెడతారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా అక్రమ మార్గంలో పనులు చక్కబెడుతున్న అధికారులు ఒక్కో పనికి రూ. 5వేలు నగదు, ఇతర నజరానాలు అందుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.

జాబితా పంపాలంటూ ఆదేశాలు..

సింగరేణిలో పదేళ్లకుపైగా ఒకేచోట విధులు నిర్వ హిస్తున్న అధికారుల వివరాలు పంపాలంటూ వివిధ ఏరియాల జీఎంలకు ఇటీవల సీఎండీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. జీఎంల విచారణలో సింగరేణి వ్యాప్తంగా 250 మందికిపైగా లాంగ్ స్టాండింగ్ ఆఫీసర్లు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. జాబితాలు అందగానే గంపగుత్తగా లాంగ్ స్టాండింగ్ ఆఫీ సర్లందరినీ ఒకేసారి ట్రాన్స్‌ఫర్ చేయకపోయినా... అంచలంచెలుగా వారికి స్థాన చలనం కలిగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

మూడేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలి..
ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



సింగరేణిలో మూడేళ్ల ఒకేచోట విధులు నిర్వహిం చిన అధికారులను బదిలీ చేయాలి. కొందరు లాంగ్ స్టాండింగ్ అధికారుల మూలంగా సంస్థలో అవినీతి పె రిగి పోయింది. ప్రతిపనికీ డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ విషయమై గత నెల 7న జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో చైర్మన్‌ను ప్రశ్నిం చాము. ఒక్కసారిగా కాపోయినా ఈ సంవత్సరం లోపు లాంగ్ స్టాండింగ్ అధికారులకు స్థానచలనం కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు.

కొవ్వొత్తుల శాంతి ర్యాలీ

నస్పూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ ఆకాల మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి తగిన న్యాయం జరుగాలని కోరుతూ నస్పూర్ మండల కోల్‌బెల్ట్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహించారు. వివిధ ఏరియాల్లో 54 చర్చిలకు చెందిన ఫాస్టర్లు, భక్తులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్స్ మెరుగు రత్న కుమార్, ఉమ్మనియేల్, ప్రసిడెంట్ క్యాతం అశోక్ పాల్, కార్యదర్శి అల్లూరి సామ్యూల్, పాస్టర్లు కమాలాకర్, లూక్ జాన్, మోసెస్, సత్యనంద్, ప్రేమ్ కుమార్, జాషువా పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు నకిలీ పత్తి విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాజశేఖర్, మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయిలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సారంగపల్లి గ్రామంలో నకిలీ విత్తనాల నివారణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులతో వారు మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదులు తీసుకోవాలన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వాడితే భూసారం తగ్గుతుందని, దిగుబడులు రావని, రైతులు నష్టపో తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



భూపతి రవి.. కొండ శ్రీనివాస్

నస్పూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని గురువారం రాత్రి ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి ద్వారా జరిగింది. అధ్యక్షుడిగా భూపతి రవి, ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా బాస్కర్ల రాజేశం, ఉపాధ్యక్షులుగా షైదం రామకృష్ణ, సీప తిరాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా క్యాతం రాజేశ్, జాయింగ్ సెక్రటరీగా వెల్పుల మల్లేష్, ఫైనాన్స్ కార్యదర్శిగా కేసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ స భ్యులుగా తలారి సమ్మయ్య, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కొడం రవి కుమార్‌లు ఎన్నికైయ్యారు.

అర్హులందరికీ సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగించాలని, ప్రతి లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా ఒక్కరికి 6 కిలోల బియ్యం పంపిణీ చేయాలన్నారు. సన్నబియ్యం రవాణాకు సంబంధించి అదనపు లారీలను సమకూర్చుకోవాలని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, ప్రతినిధులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతో తయారు చేసిన ఆహారాన్ని లబ్ధిదారులతో కలిసి స్వీకరించాలని, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ, అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు పాషా మాట్లాడుతూ రిటైర్డు, ప్రస్తుత ఉద్యోగు లకు రావాల్సిన డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డుమెంట్ వారికి సెటిల్‌మెంట్‌లు, లీవుల డబ్బులు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పింఛన్ పొందేందుకు అవకాశం కల్పించాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు సూపర్ లగ్జరీల్లో ఉచిత ప్రయాణం అనుమతించాలన్నారు. ఈకార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.



మంచిర్యాల డిపో ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మృతికి కారణమైన వారిని శిక్షించాలని కుటుంబ సభ్యుల ధర్నా



ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వేమనపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలం మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య (35) తనపై యజమాని దుర్భాషలాడారని మనస్థాపానికి గురై శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కన్నయ్య మృతికి కారణమైన ఇదే గ్రామానికి చెందిన ఎనగంటి చిన్నన్న, అతడి భార్యపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం రాత్రి ఆదివాసీ నాయకులు ఎర్మ పున్నం, మృతుడి కుటుంబీకులు వేమనపల్లిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం తెలిపిన వివరాల ప్రకారం.. మంగెనపల్లి గ్రామానికి చెందిన కన్నయ్య ఇదే గ్రామంలోని ఎనగంటి చిన్నన్న రెడ్డి వద్ద పాలేరుగా పనిచేస్తున్నా డు. ఈ క్రమంలో చిన్నన్నరెడ్డి పొలానికి శుక్రవారం మందు కొట్టే పంపు చెడిపోవడంతో ఎందుకు మరమ్మతు చేయించలేదని చిన్నన్న, అతడి భార్య లక్ష్మీ కన్నయ్యను దుర్భాషలాడాడు. దీంతో మన స్థాపం చెందిన కన్నయ్య వారి ముందే పురుగుల మందు తాగి కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు వైద్యం కోసం ఆటోలో చెన్నూరులోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కన్నయ్య మృతికి కారణమైన చిన్నన్న, అతడి భార్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి మూడు ఎకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు..

ఈ విషయంపై నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్ పటేల్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యంసీపీఐ (యు) నాయకులు ఆసుపత్రి సుపరిండెంట్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు.. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే 100 పడకల ఆసుపత్రి అని కనీస వసతులు లేక 30 పడకలక ఆసుపత్రికి పరిమితమైదన్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులు, పరికరాలు లేక జబ్బులతో వచ్చిన రోగులను మంచిర్యాలకు పంపిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందంచడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంసీపీఐ(యు) నాయకులు సురేష్, తేజ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వారంతా మంచిర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 1975 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు. అంతా కలిసి చదువుకుని 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలిసారు. శుక్రవారం మంచిర్యాలలోని కుందన హోటల్‌లో కలుసుకుని అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరితో ఒకరు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సూర్యనారాయాణ, నర్సయ్య, నారాయణ, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు 30 ఫర్నీచర్ కుర్చీలు, 80 మందికి డిక్షనరీలు, 300 మందికి బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ రాజగోపాల్, ఆర్గనైజర్ మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్, రాజ న్న మహిళ రిప్రసెంటేటివ్ రేవతి, సుధాకర్, నవీన్ చంద్ర, రమేష్ రావు, శంకర్‌కుమార్, సుశీల్‌కుమార్, ఆగారావు, హైమద్, మురళీ, సు ధాకర్, రత్నమాల, రాజ్యలక్ష్మీ, శారద, రాజమణి, సుజాత పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే గడ్డం వినోద్

తాండూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 69 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో మండల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

●ప్రభుత్వ ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు అం దిస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకట స్వామి తెలిపారు. పైలెట్‌ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం కింద 219 దరఖాస్తులు రాగా 58 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వసంత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్థులు

ఇందిరమ్మ ఇండ్ల భూమి కోసం గోపాల్‌నగర్‌కు వచ్చిన ఎమ్మెల్యే వినోద్‌ను ప్రజలు నిలదీశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు రాలేదని న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మళ్లీ సర్వే చేసి అర్హులైన వారందరికి ఇండ్లు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

●మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి రూరల్ : పేదలకు వరం ఇందిరమ్మ ఇల్లని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. కన్నాల గ్రామానికి చెందిన దోనేటి లావణ్య రాజమౌళి ఇల్లును కొబ్బరికాయ కొట్టి భూమిపూజ కార్యక్రమం చేశారు. ఎంపీడీవో మహేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

గురుకుల పరీక్షా ఫలితాల్లో ప్రతిభ


భీమిని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేస్లాపూర్, వీగాం ఎస్సీ కాలని, వెంకటాపూర్, అక్కలపల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలల 5వ తరగతి విద్యార్థులు గురువారం రాత్రి గురుకుల ఎంట్రన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. కేస్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు, వీగాం ఎస్సీ కాలని పాఠశాలలో నలుగురు, వెంకటాపూర్‌లో ఐదుగురు, కృలపల్లి పాఠశాలలో ముగ్గురు సెలక్ట్ అయ్యారు. ఈ ఫలితాలు రావడానికి కృషి చేసిన ప్రధానోపాధ్యా యులు సైదం వెంకటేష్, రజని, రాజేశ్వరి, కళావతి, ప్రియాంకలను ఎంఈవో కృష్ణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

వేమనపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలంలోని బొమ్మెన గ్రామంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. అచ్చలాపూర్‌కు చెందిన వేద పండితుడు ముద్దు నరహరి శర్మ ఆధ్వర్యంలో ఉదయం లక్ష్మీగణపతి, నవగ్రహ, వాస్తు, పంచాసూక్త, రుద్ర హోమాలు నిర్వహించారు. యంత్ర విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం బలి ప్రదానం, మహా పూర్ణాహుతి ఘటాభిషేకం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సన్నబియ్యం పంపిణీ

మందమర్రిరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగులపేట గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ మండల నాయకుడు కడారి జీవన్‌కుమార్ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం అందిస్తున్న ఘనత సీఎందేనని పేర్కొన్నారు. సన్నబియ్యం తీసుకుని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రా జేశ్వర్, కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, ఒడ్నాల కొముర య్య, సంతోష్, రాజలింగు, శ్రీనివాసరెడ్డి, నీలయ్య, కుమార్, నంబయ్య, ఆనంద్, సమ్మయ్య పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత

జన్నారం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట గ్రామ శివారు నుంచి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. కొత్తపేట గ్రామానికి చెందిన పూదరి రాజేందర్, కవ్వాల గ్రామానికి చెందిన ఇజాజుద్దీన్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

మామిడి కొనుగోళ్లకు సన్నద్ధం..

- ఏళ్లుగా నిరుపయోగంగా యార్డు
- ఈ సీజన్‌లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారుల ఏర్పాట్లు
- జిల్లాల్లో వేల ఎకరాల్లో మామిడితోటలు

7

పన్ను వసూలు.. @ 94 శాతం

- వంద శాతం దిశగా సిబ్బంది ప్రయత్నాలు

6

- సింగరేణిలో అధికారుల ఇష్టారాజ్యం
- ఏడెనిమిదేళ్లకుపైగా ఒకే చోట ఉద్యోగం
- సంస్థలో 250 మంది వరకు ఇలాంటి ఆఫీసర్లే
- అనుయాయులకు నచ్చినచోట పోస్టింగ్‌లు

పాతుకుపోయారు..!



మంచిర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో కొందరు అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి ఒకటేచోట ఉద్యోగం చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. నజరానాలు ఇచ్చే కింది స్థాయి ఉద్యోగులకు నచ్చినచోట పోస్టింగులు ఇప్పిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సింగరేణిలో అధికారులను మచ్చిక చేసుకుంటున్న కొందరు కిందిస్థాయి ఉద్యోగులు, కార్మికులు మస్టర్లు పడి వెళ్లిపోవడం ఓ వైపు జరుగుతుంటే, ఇప్పుడు కొందరు లాంగ్ స్టాండింగ్ అధికారుల అవినీతి కారణంగా సంస్థ అబాసు పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం స్వయంగా సింగరేణి సీఎండీ బలరాం నాయక్ దృష్టికి వెళ్లడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోంది.

జోరుగా డబ్బు, నజరానాలు....

ఏళ్లతరబడి ఒకటే చోట తిష్టవేసిన కొందరు అధికారులు గనులపై తాము ఆడిందే ఆటగా వ్యవహరిస్తున్నారు. తమ అనుయాయులకు తేలికైన పని ఇచ్చినందుకుగాను పెద్ద మొత్తంలో డబ్బులు, ఇతర నజరానాలు అందుకుంటున్నట్లు బాహాటంగా ప్రచారం జరుగుతోంది. కొందరు అండర్ మేనేజర్లు వారి కింద పనిచేసే ఓవర్‌మన్లను దగ్గర పెట్టుకుని వారి ద్వారా పనులు చక్కబెడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు మేనేజర్లు సింగరేణి హెడ్ ఆఫీస్‌లో పై అధికారులతో సత్సంబంధాలు పెట్టుకుని తమకు బదిలీలు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ స్థానికంగా గనులపై అధికారాలు చలాయిస్తున్నారు. అలాగే కొందరు ఇంజనీర్లు గనుల్లో ఇతర విభాగాల్లో విధులు నిర్వహించే ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లను తమ పరిధిలోకి తీసుకోవడం ద్వారా తేలికైన పనులకు పురమాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. శ్రీరాంపూర్ డివిజన్‌కు చెందిన ఓ ఇంజనీరు.

దీర్ఘకాలిక పోస్టింగ్‌లో వందలాది మంది..

సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో ఒకేచోట దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు సు మారు 250 మంది వరకు ఉంటారని సమాచారం. వీరంతా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న చోటే ఎని మిదేళ్ల నుంచి పదేళ్ల వరకు కొనసాగుతున్నట్లు తె లుస్తోంది. ఉన్నచోటనే దీర్ఘకాలికంగా విధులు నిర్వ హిస్తున్న అధికారుల్లో అండర్ మేనేజర్లు, మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్లు, ఇంజనీర్లు ఉన్నారు. వీరిలో 90 శాతం మేర అవినీతికి ఆజ్యం పోస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్క శ్రీరాంపూర్ డివిజన్‌లోనే 27 మంది వరకు లాంగ్ స్టాండింగ్ అధికారులు విధుల్లో ఉండటం గమనార్హం. వీ రంతా తన కిందిస్థాయి అధికారుల సహకారంతో ఇతర ఉద్యోగులు, కార్మికులకు అనుకూలమైన చోట పోస్టింగులో ఇప్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉదాహరణకు అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికు డు సర్ఫేస్‌కు రావాలంటే సదరు అధికారులను ఆశ్ర యిస్తేచాలు అప్పటికప్పుడే పని అయిపోతుందనే ప్ర చారమూ జోరుగా సాగుతోంది. అలా అవినీతి అధి కారుల అండదండలతో అర్హతలేని వారు ఎందరో స ర్ఫేస్‌లో విధులు నిర్వహిస్తుండగా, అన్ని అర్హతలు న్న కార్మికులు మాత్రం దొడ్డిదారి మార్గం దొరక్క అండర్ గ్రౌండ్‌లలోనే మగ్గాల్సిన పరిస్థితులు ఉన్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి.

(తరువాయి 7లో)

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో గూగుల్ ,పే టీఎం, ఎల్ఐసీ, మారుతి సుజికి, మెడ్ ప్లస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఆక్సిస్ బ్యాంకులు తదితర కంపెనీలు పాల్గొన్నాయి. ఇందులో 310 మంది గ్రాడ్యుయేట్‌లు, తృ తీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొనగా రాత పరీక్ష, గ్రూప్ డి స్కషన్ నిర్వహించారు. మొత్తం 94 మందిని ఉద్యోగాలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉపేందర్‌రెడ్డి, కరెస్పాం డెంట్ శ్రీనివాసరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దీపాబారాజు, ఇన్ చార్జి శ్వేత, రోహిత్, గోపికృష్ణ, అధ్యాప కులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి పత్రం అందజేత



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

మంచిర్యాల క్రైమ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యా వనరుల కార్యాలయంలో డీపీఈపీ అసిస్టెంట్ సెక్రటరీ నియామకాన్ని వెంటనే సీనియారిటీ ప్రకారం అవకాశం కల్పించాలని కోరుతూ టీఎస్ యుటీఎఫ్, డీపీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సంయుక్తంగా డీఈవో యాదయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజే శారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డీపీఈపీలోని సభ్యుల కాల పరిమితి ముగియడంతో అసిస్టెంట్ సెక్రటరీని అదే విధంగా డీఎఫ్‌వోను కార్యాలయంలోని టీచింగ్ స్టాఫ్‌ను సొంత కార్యాలయాలకు పంపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చక్రపాణి, రాజవేణు, రమేష్, జైకిష్ణలు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైమ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని 23,24వ వార్డుల్లో జైబాపు, జైభీం, జైసంవిధాన్ అవగాహన ర్యాలీని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశాన్ని, రాజ్యాంగంను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం నాయకులతో రాజ్యాంగంను కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేసారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చల్ల మహేష్, నాయకులు వేములపల్లి సంజీవ్, బానేష్, సంజీవ్, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పెంట రజిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

లక్సెట్టిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పిలుపు మేరకు లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని 4,5,10,11వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాయకులు జైబాపు, జైభీం, జైసంవిదాన్ అవగాహన ర్యాలీ 3వ రోజు నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా భారతీయ జనతాపార్టీ పరి ణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తు ప్రజాస్వాయ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకొల్పుతున్నాయన్నారు. ఈకార్య క్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, సురేష్ నాయక్, నవాబ్, శ్రీధర్, అన్వర్ రఫీక్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



హనుమాన్ దీక్షపరుల బైక్ ర్యాలీ,శోభాయాత్ర

దండేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విభిన్న హిందూ సంస్కృతి సంప్రదాయాలకు నిలయ మని, సంస్కృతి, సంప్రదాయాలను కపాడుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం దీక్షాపరులు హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. మేదరి పేట హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అక్కడి నుంచి హనుమాన్ శోభయాత్రను ఘనంగా దీక్షపరులు, భక్తులు చేపట్టారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందరంగా ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ ప్రతి ఒక్క హిందువు సోదర భావంతో మెలగాలని, యువత సన్మార్గంలో నడుస్తూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ శోభాయాత్రలో పెద్ద ఎత్తున హనుమాన్ స్వాములు భక్తులు, అధికసంఖ్యలో తరలివచ్చి ఐకృత చాటుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు శ్రీనివాస్, గురువయ్య, సురేష్, సంతోష్, శేకర్ పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి



బుగ్గగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి

కాసిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సొంతింటి పథకం కింద ఇందిరమ్మ ఇండ్లు అర్హులైనవారందరికీ మంజూరు చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. మండలంలో ఇందిర మ్మ ఇండ్లపైలెట్ ప్రాజెక్టు కింద బుగ్గగూడెం గ్రామాన్ని ఎంపిక చేయగా శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుందని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. అనం తరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మా ట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన నిర్వహకులను కలెక్టర్ అభినందించారు. ఈశిబిరంలో 98మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అత్యవసర వైద్యం అవసరంఉన్న వారిని మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, మెడిలైఫ్ ఆసుపత్రి డాక్టర్ కంటం కుమారస్వామి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమణ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు , ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అవగాహన ర్యాలీ

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్ , జై సంవిదాన్ ర్యాలీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ కొద్ది రోజులుగా బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరా స్తోందన్నారు. సమాజంలో అశాంతి నెలకొ ల్పేందుకు చూస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను తిప్పికొడుతూ ఈ ర్యాలీ చేపట్టామన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రత్నం ప్రదీప్, ఆల్క రాజు, స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఉచిత వృత్తి విద్యాశిక్షణ

మంచిర్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ట్రైబల్ సంస్థ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాయిని ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ బాల సంకుల వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయిని ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా మంచిర్యాల జిల్లాలోని ముల్కల్లలో గల ప్రభ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో వృత్తి విద్యాకోర్సుల్లో ఏడాది కాలంపాటు కంప్యూటర్ ఎడ్యుకేషన్, టైలరింగ్, బ్యూటీషియన్, జీడీఎ, వెల్డింగ్ కోర్సుల్లో 80శాతం విద్యార్థినిలకు, 20శాతం విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ధర్నా



దండేపల్లిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ఆదివాసీ గిరిజనులు

దండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని సీపీ ఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. సీపీఎం రాష్ట్ర జిల్లా కమిటీ పిలుపు మేరకు మండలం లోని అన్ని గ్రామాల్లోని సీపీఎం బృందాలు 15రోజుల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేపట్టారు. శుక్రవారం సీపీఎం, టీఏజీఎస్ ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజనులు, ప్రజలతో దండేపల్లి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా చాకలి ఐలమ్మ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలపేరిట ప్రజలను మోసం చేస్తూ సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్, సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రా న్ని అంద జేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శులు సంకె రవి, కనికారపు అశోక్, బోడేంకి చందు, సభ్యులు దుంపలరంజిత్ కుమార్, అబ్దుల్లా, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శ్యామల, ఉమారాణి, సమక్క, లింగ న్న, రైతు సంఘం నాయకులు లక్ష్మణ్, సిఐటి యు నాయకులు రమాదేవి గిరిజనులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న వేధ పండితులు

దండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామా సహితదాసాం జనేయ ఆలయంలో నవగ్రహ శివపంచాయతన ధ్వజస్థంభ యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభోపేతంగా ప్రారంభం అయ్యాయి. వాస్తు జ్యోతిష్య పండితులు బ్రహ్మ శ్రీ వేమునూరి వెంకటచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. అందులో భాగంగా మొదటిరోజు మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యా హవాచనం, కంకణదారణ, యగాశాల ప్రదక్షణ, ప్రవేశం ఆఖండ దీపస్థాప, కుంకుమార్చ పూజలు, జలాధివాసము, హవణము ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా జరిపించారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో ఆలయ నిర్వహణ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.